

# మాటా మంతీ

-సాయి పద్మ



**- 5 -**

## మనక్కావలసింది ఏంటి ?

అసలు అర్ధం కాని విషయాల్లో .. వొకటి, అసలు మనక్కావలసింది ఏంటీ అని ..? మనకి అంటే, సదరు తెలుగు జాతికి, ఇక్కడ ఉన్నా లేక దేశాంతరాల్లో ఉన్నా.. ఈ తెలుగూస్ ఉన్నారే , మనకో పట్టాన అర్ధమై చావరు. మనం తెలుగులో మాట్లాడితే, ఇంగ్లీష్ లో జవాబిచ్చే సగటు తెలుగు మనస్తత్వం కష్టమే సుమీ..! కానీ ,తప్పదు, ఇవాళ టాపిక్ అదే!

తెలుగు వాళ్ళు నన్ను ఆశ్చర్యపరుస్తారు– శంకరాభరణం, సాగర సంగమం చూసిన కళ్ళతో , టెంపర్ లూ, ఏమే వోసే పూరీ సినిమాలూ చూసి తరించగలరు. పోనీ పాపం మనిషికో టేస్ట్ మహిలో సుమతీ.. అనుకున్నా, సకుటుంబ సపరివారంగా లెజెండ్ సినిమాకి వెళ్ళగలిగే కెపాసిటీ ఉన్నవాళ్ళు. వీళ్ళు వోకరకంగా సాధుజంతువులు. కానీ, ఎడా పెడా హీరో రక్తపుటేరులు పారిస్తున్నా, నిరాసక్తంగా పాప్కార్న్ నములుతూ చూడగలరు. నిర్భయ రేప్ గురించి గంటలు గంటలు మాట్లాడే వీళ్ళు, నెల్లూరు లో రేప్ జరిగితే , "రోజులు పాడయిపోయాయి అండీ.. మా రోజుల్లో, నెల్లూరు ఎలా ఉండేదీ?" అని వొక సినిమా టైం అంత లెక్చర్ ఇవ్వగలరు. లివ్ ఇన్ రిలేషన్ అంటే , కేవలం అమెరికాలోనే జరుగుతుంది , అని మన హైదరాబాదులనీ .. కాకినాడ కాలేజీ హాస్టళ్ళ నీ పట్టించుకోనంత అమాయకుల్ని చూస్తే , నిజంగా ఆశ్చర్యం రాదా మీకైనా ?

తెలుగు వాళ్ళు నన్ను ఇబ్బంది పెడతారు– గృహప్రవేశాలనీ , పెళ్ళిళ్ళనీ, వోణీ ఫంక్షన్లనీ హడావిడి పడేవాళ్ళని చూస్తే , కొంచం ఇబ్బందిగా ఉంటుంది. " అయ్యో ! పెళ్లి లేదా ? పట్టుచీర విప్పెయనా ?" అని అడిగే జంధ్యాల పాత్ర వొకటి భలే గుర్తొస్తుంది. ఎప్పుడెప్పుడు ఈ తంతు అయిపోతుందా ఫేస్ బుక్ లో ఫోటోలు అప్లోడ్ చేసి, వేషం మార్చేద్దామా అని చూసే వధువులూ, వరులూ, వోణీ అమ్మాయిలూ.. తర్వాత ఆ వోణీ వేరే దేశంలో హడావిడిగా సంస్కృతీ, సాంప్రదాయం ఎవరైనా గుర్తు చేసేదాకా గుర్తురాదు. ఇకపోతే, అబ్బాయిల తెలుగు డ్రెస్ చాలావరకూ పేంటూ, చొక్కా కాబట్టి బెంగే లేదు. వాళ్లకి చాలా మార్పులతో సంబంధం లేదు. " సరిగంచు చీర ఊహించినాను " అని కలల్లో తేలిపోవటమే! మన తెలుగు సినిమాల్లా , సీన్ ఏ యూరప్ కో, ఆస్ట్రేలియాకో మారిపోయి ఉంటుంది, కాస్ట్యూమ్స్ తో సహా..!

తెలుగు వాళ్ళు నన్ను చిరాకు పెడతారు– ఆడవాళ్ళకి మాత్రమే , అని రాసిన ప్రతీ దానినీ మగవాళ్ళు వాడటం దగ్గరనుండీ.. దేనికీ లైన్ లో సరిగ్గా నిలబడకపోవటం వరకూ.. తిరుపతి దేవుడి దర్శనం రికమెండేషన్ కోసం ఎంత దూరమైనా వెళ్ళటం దగ్గర నుండీ....ఇంట్లో రామయ్య వీధిలో క్రిష్టయ్య టైప్ లో వేరే వేరే ముఖాలు తగిలించుకొనే వరకూ..! అన్నిటికన్నా ముఖ్యమైన చిరాకు ఏమిటీ

అంటే.. నో ' అని చెప్పకపోవటం.. అలా అని ఎస్ కూడా అనరు దేనికీ.. రెంటి మధ్య త్రిశంకుస్వర్గంలో వాళ్ళు వేలాడుతూ.. మిగతావాళ్ళని టైట్ రోప్ వాకింగ్ చేయిస్తారు... వీళ్ళకన్నా ఈటె వాళ్ళు నయం.. వాళ్ళ వృత్తి అది పాపం...!! ఆఖరుకి ఈ మొహమాటమో, మరేమిటో తెలీదు గానీ.. ఈ జాడ్యం ఎక్కడిదాకా దారి తీస్తుంది అంటే.. ఏదన్నా వూరు వెళ్లి దారి అడిగితే , వాళ్లకి తెలీదంటే, తెలీదని చెప్పరు, మధ్యలో తలాడిస్తారు. లేదా, ఇక్కడే ఉండాలండీ.. తాజ్ మహల్ కదిలిపోయిందేమో అన్న చందాన అడ్రస్ చెప్తారు. ఈ జబ్బు కొంచం నాక్కూడా ఉందండోయ్ ..!

తెలుగు వాళ్ళు నన్ను హింసిస్తారు– వొక మనిషి పైకి చేరుతుంటే, వెనక్కి లాగే నత్తల జాతిలాంటి వొక ప్రమాదకరమైన లక్షణంతో వీళ్ళు మనుషుల్ని భలే హింసిస్తారు. విచిత్రం ఏమిటంటే, చాలా హింసలకి ప్రత్యేకమైన కారణాలు ఉండవు. తాను వూరు వెళ్ళేటప్పుడు ఉప్మా చేయలేదని కోడలి మీద అలిగి, కొడుకుని జీవితకాలం హింసించిన తల్లుల్ని చూస్తుంటే, వీళ్ళ మోటివేషన్ ఏమిటా అని ఆశ్చర్యం వేస్తుంది. కల్చర్ అనేది ఇన్ని విభజన గీతలు గీస్తుందా అని ఒక భయం వేస్తుంది.

తెలుగు వాళ్ళు నన్ను సంతోషపెడతారు– చాలాసార్లు నేను గ్రహించినదీ మీకు పంచబోయే మహా బోధ ఏమిటంటే ... మనం చాలా గొప్ప ఫాలోవర్సుమి, సొంతానికి ఏదన్నా కనిపెట్టాలంటే, ముందు సందేహాలే.. కానీ ధైర్యం చేసి ముందడుగు వేసేవాళ్ళ వెనుక నడిచే కాళ్ళు మనవాళ్ళవే! ఈ ఫోలోవర్స్ ఒకోసారి ఎంత బేవార్స్ గా అవుతుందీ అంటే, లెజెండ్ కీ, సెలబ్రిటీ కీ మధ్య మామూలు ఫాలోవర్స్ కొట్టుకోనేంత ..! కానీ ఇంకో కోణంలో ఆలోచిస్తే, వొక నమ్మిన చిన్న నిజం కోసం పూర్తి స్థాయి లో కమిట్ అయి , వొక గ్రూప్ కి డెడికేట్ అయ్యే వొక లక్షణం కనిపిస్తుంది. ముఖ్యంగా, మంద నుండి విడివడి, తనదైన వ్యక్తిత్వాలు ఎర్పరచుకొంటున్న కొత్తతరం మీద నాకు చాలా ఆశలు ఉన్నాయి. ఉదాహరణకి, మా హాస్టల్ అమ్మాయి ఒకామె, తన గోల్ ఎంటి అంటే, అమ్మాయిలపై ఎవరైనా అటాక్ చేసినా, అత్యాచారం చేయాలని ప్రయత్నించినా , అమ్మాయి దగ్గర ఉన్న ఒక డివైస్ వల్ల, పోలీస్ స్టేషన్ లో అలారం మోగే ఏర్పాటు చేస్తుంది అంట. అవుతుందో లేదో అది వేరే సంగతి, ఆ తపన కి ముచ్చట వేస్తుంది. భవిష్యత్ మీద ఆశ కలుగుతుంది. వీళ్ళ మీద మనం పెట్టుకున్న నమ్మకం వమ్ము చేయరన్న ధైర్యం వస్తుంది.

ఎక్కడో, జీవితాన్ని సెలెబ్రేట్ చేసుకోవటం మర్చిపోయిన మనం,

నలిగిన పాత దారుల సౌకర్యంలో నడుస్తున్న జనం

అలుపెరుగని కొత్త దారుల్లో, గమ్యం కన్నా గమనం ముఖ్యం అన్న వొక చిన్న వెలుగు .. మనక్కావలసింది ఏమిటో తెలిసేలా చేస్తుంది ప్రతి వొక్కరికీ.. !

మళ్ళీ వచ్చే నెల కలుద్దాం.. కొన్ని కొత్త విషయాలతో.. !

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments